

'ప్రజారక్షణ భేరి' ప్రారంభం

- ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ను ప్రారంభించిన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే

ప్రజాశక్తి - విలేకరులు

రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఆదోని పాతబస్టాండ్ వద్ద సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. బస్సుకు ముందుగా ఢణాపురం వరకు సిపిఎం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆలూరు, పత్తికొండ, కోడుమూరు మీదుగా కర్నూలు వరకు బస్సు యాత్ర సాగింది. యుటిఎఫ్ నాయకులు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీ నాయకులు యాత్ర బృందానికి వినతి పత్రాలు సమర్పించారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరులో సభలు నిర్వహించారు. కర్నూలు బళ్లారి చౌరస్తాలో సిపిఎం నాయకులు బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ అంబేద్కర్ కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు.



కోడుమూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

కార్మిక సమస్యలు పట్టని మంత్రి ఉన్నట్టా.. లేనట్టా..?
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

ఆలూరు : కార్మిక సమస్యలు పట్టని మంత్రి గుమ్మనూరు జయరామ్ ఉన్నట్టా.. లేనట్టా..? అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ధ్వజమెత్తారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్రలో భాగంగా ఆలూరుకు వచ్చిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆలూరు తాలూకా నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ ఆధ్వర్యంలో ఆస్పరి మండల కార్యదర్శి పి.హనుమంతు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడారు. ఆలూరులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు కార్మిక సమస్యలు కనిపించవా అని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదానికి గురై కష్టాలు పడుతున్నారని తెలిపారు. ఇసుక లేకపోవడంతో భవన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలు, అంగన్వాడీలు, విఎఒలు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో మంత్రి ఉండి కూడా వేదవతి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆస్పరి మండలంలో ఇట్టినా కంపెనీకి చెందిన భూములను రైతులకు ఇప్పిస్తానని చెప్పి మంత్రి కొనుగోలు చేసినట్లు రిజిస్టర్ చేయించుకొని రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమను పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, గ్రామాల్లో ప్రజలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారని చెప్పారు. వర్షాల్లేక పంటలు ఎండిపోతుంటే పంటలను పరిశీలించాలని అధికారులకు ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వైసిపిని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ప్రజలను కోరారు. అంతకుముందు ప్రజా నాట్యమండలి కళాకారులు కళా నృత్యాలతో ఉత్తేజ పరిచారు. గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్, స్కావెంజర్లు, బజారీ హమాలీలు, సిపిఎం కొట్టాల కాలనీ, ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఉమామహేశ్వరవు, కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి మాట్లాడారు. శివ నాగరాణి, నల్లప్ప, భాస్కరయ్య, కెపి.నారాయణస్వామి, వెంకటేశులు, ఈరన్న, కృష్ణ, రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

కోడుమూరు/కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఉన్న ఉపాధి కూలీల వలసల నివారణకు చర్యలు తీసుకోవడంలో వైసిపి విఫలం చెందిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ విమర్శించారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్‌కు నియోజకవర్గ సమస్యలు పట్టడం లేదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాత్రం పంచాయితీల పేరుతో అబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ప్రజా రక్షణ భేరి యాత్ర కోడుమూరుకు చేరుకుంది. యాత్ర బృందానికి సిపిఎం శ్రేణులు స్వాగతం పలికాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. గఫూర్ మాట్లాడుతూ... గతంలో ఈ నియోజకవర్గంలో ఎల్ఎల్‌సి ద్వారా సాగునీరు అందేదన్నారు. ఇప్పుడు రైతులకు సాగునీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. తుంగభద్ర ద్వారా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాలని కోరారు. ఇటీవల పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాలకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా జిల్లా అభివృద్ధి మండలి సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించిన దాఖలాలు లేవన్నారు. నవంబర్ 15న విజయవాడలో చేపట్టే బహిరంగ సభలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ప్రజాప్రణాళికను విడుదల చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు ఛాయలు నెలకొన్నాయ న్నారు. కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపికి వత్తాసు పలుకుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, ఉమామహేశ్వరరావు, రమాదేవి, మండల కార్యదర్శి గఫూర్‌మియా, కె.రాజు, వీరన్న, లక్ష్మన్న, సిఐటియు పెద్ద వీరన్న, మనోహర్, గూడూరు మండల నాయకులు మోహన్, మాజీ మండలాధ్యక్షులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

పత్తికొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దోచుకో దాచుకో అన్న విధంగా రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజారక్షణభేరి బస్సు యాత్ర ఆలూరు మీదుగా పత్తికొండ చేరుకుంది. పత్తికొండలో ఆర్‌టిసి బస్టాండ్ నుండి పత్తికొండ, తుగ్గలి, మద్దికేర మండలాల సిపిఎం నాయకులు కార్యకర్తలు ప్రజారక్షణ భేరీ బస్సు యాత్రకు స్వాగతం పలికారు. యాత్ర నాలుగు స్తంభాల కూడలి మీదుగా అంబేద్కర్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎం.ఎ.గఫూరు హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు చేస్తే అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు.

పలువురు వినతులు : పంచాయతీ కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, కుటుంబాలు ఇబ్బంది పడుతున్నామని వినతి పత్రం అందజేశారు. అంగన్వాడి వర్కర్స్, కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి పెండింగు టిఎ, డిఎలను విడుదల చేయాలని గఫూర్‌కు వినతిపత్రం అందజేశారు.



ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న యువజనసంఘం నాయకులు



కర్నూలు బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



పత్తికొండలో వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు



కర్నూలులో పిఎన్ఎం కళాకారుల దృశ్య రూపకంలో ఓ సన్నివేశం



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే

మోడీ, జగన్ ప్రభుత్వాలను
గద్దె దించాలి

- వామపక్షాలను బలపరచాలి
- కర్నూలు బహిరంగ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్

మోడీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దించాలని, వామపక్షాలను బలపరచాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే పిలుపునిచ్చారు. సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర సందర్భంగా కర్నూలు పాతబస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నల్లధనం తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని మోడీ చెప్పారని, ఎవరి ఖాతాలోనూ 15 పైసలు కూడా పడలేదన్నారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్తాను మోడీ జైలులో పెడితే, చంద్రబాబును జగన్ జైలులో పెట్టారని తెలిపారు. విపక్షాలు ఏకంగా లేకపోవడం వల్ల గత ఎన్నికల్లో బిజెపి గెలిచిందని, రాబోయే ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనట్లుగా దుర్మార్గమైన పాలన సాగిస్తోందని తెలిపారు. గ్యాస్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి భారీగా పెంచారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మోడీని ప్రజలు ఓడించనున్నారని తెలిపారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై రాష్ట్రంలో ఇప్పుడు చర్చ లేదని, ప్రజా సమస్యలపై చర్చ పెట్టాలని ఈ బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. రాజకీయ పగ సాధింపులు టిడిపి మీద, వామపక్షాల మీద, మొత్తం ప్రజల మీద సాగుతున్నాయన్నారు. ఇంతలా పాలిస్తున్న జగన్ మళ్లీ గెలవడం అసాధ్యమని తెలిపారు. బిజెపి దేశాన్ని కొల్లగొడితే వైసిపి రాష్ట్రాన్ని కొల్లగొడుతోందని, ఎమ్మెల్యేలు ప్రజలను కొల్లగొడుతున్నారని, కమీషన్లు వసూలు చేస్తున్నారని చెప్పారు. అప్పర్ భద్ర వల్ల తుంగభద్రకు నీళ్లు లేకుండా పోయే పరిస్థితి ఉందన్నారు. పోలవరం నీళ్లలోనూ వాటా ఇవ్వాలని కెసిఆర్ అంటుంటే ఎపిలో ఉన్న ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మోడీకి వ్యతిరేకంగా ఒక్కరు కూడా మాట్లాడడం లేదన్నారు. వైసిపి రాష్ట్రంలో సింహంలా ఉంటే ఢిల్లీలో గ్రామ సింహంలా ఉంటుందని ఎద్దేవా చేశారు. హైకోర్టును కర్నూలులో పెడుతున్నామని ఒక ఉత్తరం కూడా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం రాయలేదన్నారు. హైకోర్టును కర్నూలులో పెట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. హైకోర్టు వచ్చిందని ఎగిరే నాయకులను ఏమనాలని ప్రశ్నించారు. కర్నూలుకు హైకోర్టు రాకుండా ఎవరు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి బటన్ నొక్కడం ద్వారా రూ.2.5 లక్షల కోట్లు ప్రజలకు పంచితే మిగిలిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌కు ఒక విధానం లేదన్నారు. ప్రజలు తాత్కాలిక ఆకర్షణపై కాకుండా శాశ్వతమైన అభివృద్ధిపై ఆలోచించాలని, ప్రజా సమస్యలపై నిలబడాలని కోరారు. రాజధాని అంటే బాహుబలి గ్రాఫిక్ కాదని, అమరావతి రాజధానిగా ఉంటూ రాష్ట్రమంతటా సమానంగా అభివృద్ధి చేయాలని అన్నారు. అభివృద్ధి కోసం వామపక్షాలతో కలిసి పోరాటం చేయాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేసే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వం కూడా నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిజెపితో టిడిపి, వైసిపి అంట కాగుతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే సాగునీటి ప్రాజెక్టులు కట్టాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా అన్నింటిలో వెనుక పడటానికి పాలకులే కారణమన్నారు. సిపిఎం పెడుతున్న ప్రత్యామ్నాయం గురించి ప్రజల ఆలోచించాలని, సిపిఎం పోరాటాల ద్వారా మాత్రమే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సిపిఎం మద్దతుగా నిలిచి పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మద్దతు తెలుపుతూ మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పి.నిర్మల, రాష్ట్ర నాయకులు భాస్కరయ్య, శివ నాగరాణి, దయా రమాదేవి, అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు, పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శులు రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాటలు, కళారూపాలు...

ప్రజారక్షణభేరి యాత్ర కర్నూలు వచ్చిన సందర్భంగా పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభ స్థలంలో ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాటలు, నాటికలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులు ఎర్రజెండా ఔన్నత్యాన్ని, కరువు తాగునీరు, సాగునీరు, ధరల గురించి, రైల్వేలు, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, విశాఖ ఉక్కు, బ్యాంకులు, లాంటివి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఎలా ధారాధత్తం చేస్తుందో తెలియజేస్తూ, సిపిఎం వైపు కదలిరండి, కదలిరండి అంటూ పాడిన పాటలు, మూడు ముక్కలాట నాటిక ప్రదర్శనలు ప్రభుత్వాల వల్ల ప్రజలు ఎలా పీడింపబడుతున్నారో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ప్రదర్శనలు, పాటలు పాడిన వారిలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.నాగరాజు, కళాకారులు ఆర్.బాల మద్దయ్య, పి.బతుకన్న, కోవెలకుంట్ల నాగరాజు, కె.సరిత, ఎస్.హసీనా, ఎం.అచ్చయ్య, కె.చిన్న వెంకటయ్య, కె.శేషన్న, పూజారి శ్రీనివాసులు, సాకే పుల్లన్న, మారెళ్ల వెంకట చలపతి, ఎస్.నారాయణ, జిల్లా నాయకులు ఎంపి.బసవరాజు, లోకేష్, నాగ సుంకన్న, సుబ్బరాయుడు, చిట్టి, రాంబాబు ఉన్నారు.



గిడుగు రుద్రరాజు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మూలింటి మారెప్ప

మళ్లీ కాంగ్రెస్ గూటికి మూలింటి మారెప్ప

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాజీ మంత్రి మూలింటి మారెప్ప కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం విజయవాడలో పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఎఐసిసి కార్యదర్శి కిష్టఫర్, తిలక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మూలింటి మారెప్ప కాంగ్రెస్ లోచేరడాన్ని ఆహ్వానిస్తున్నట్లు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నంద్యాల డిసిసి అధ్యక్షులు బాబురావు, లక్ష్మీనరసింహ కూడా ఉన్నారు.



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , తదితరులు

రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామంలో రూ.23.90 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం, రూ. 20.80లక్షలతో వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ లను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. చెరుకులపాడు సర్పంచి రాములమ్మ, ఎంపిటిసి సభ్యులు రాజేశ్వరి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, కర్నూలు జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డితో పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ స్కూల్ లలో మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి చిన్నారులతో మాట్లాడారు.మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు ఐదు వినతులు

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని ఆయా సమస్యలపై తహసీల్దార్ శేషఫణి సోమవారం స్పందన కార్యక్రమం చేపట్టారు. ఇక్కడే భూ సర్వే సక్రమంగా చేయలేదని, ఆన్‌లైన్ చేయాలనీ, తదితర సమస్యలపై ఐదు గురు నుండి వినతులు స్వీకరించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

150 పనిదినాల పెంపునకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి కూలీల వలసలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద 150 రోజులు పనిదినాలు పెంచాలని చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వెల్లడించారు. ఉపాధి పని దినాల పెంపునకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలవడనున్నాయని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారాంతపు సమీక్ష చేపట్టారు. కన్సిస్టెంట్ రిథమ్‌కు సంబంధించి స్కూల్ ఇన్‌స్పెక్షన్ లో కౌతాళం, పెద్దకడుబూరు, కృష్ణగిరి తక్కువ శాతం పురోగతి సాధించారన్నారు. హాస్టల్ తనిఖీలో పెద్దకడుబూరు, అంగన్వాడి తనిఖీలో భాగంగా పలు అంశాలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పిడిని కలెక్టర్ ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి పెండింగ్ ఉన్న మాస్టర్ డేటాను ఎంపిడిఒలు రేపు సాయంత్రం నాటికి వివరాలను వెరిఫై చేసి పంపాలన్నారు. అదే విధంగా వచ్చే సోమవారం నాటికి క్రీడల నిర్వహణకు అనువైన మైదానాలను గుర్తించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు రీఓపెన్ శాతం తగ్గాలి :కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్: స్పందనకు వస్తున్న ప్రజా సమస్యల రీఓపెన్ శాతం తగ్గాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో స్పందన" కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందనకు సంబంధించి మండలాల్లో పరిష్కారం కావలసిన సమస్యలు జిల్లా స్థాయికి వస్తున్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే శాఖలకు సంబంధించిన అంశాల పై చాలా ఎక్కువ అర్జీలు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకాన్ని ప్రజలకు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రీ ఓపెన్ కేసులు కర్నూలు రూరల్, ఆస్పరి, మద్దికెర, ఆదోని అర్బన్, హాలహర్వి, ఓర్వకల్లు తదితర మండలాల్లో ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కేసులను సంబంధిత డివిజనల్ అధికారులు ప్రత్యేకంగా సమీక్షించాలని సూచించారు. వీటిలో ఎన్ని కేసులు పరిష్కరించవచ్చని, ఎన్ని చేయలేమనేవి సమీక్షించి రీ ఓపెన్ కేసుల శాతం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కార్యాలయాల భవనాల ఆధునీకరణ పనులను 3, 4 నెలలోపు పూర్తి కావాలన్నారు. తదనుగుణంగా పనులు వేగంగా జరిగేలా ఒక బ్లాక్ లోని అన్ని కార్యాలయాల్లో పనులు జరిగేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. వచ్చే విజిటర్స్ వాహనాలకు సమాచార శాఖ కార్యాలయం ఆవరణలో పార్క్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్య కలాపాలకు కలెక్టరేట్ వేదిక కాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవినీతి లేని అంకితభావం అవసరం

విజిలెన్స్ వారోత్సవాలలో ఆర్‌విఇఒ నీలం పూజిత

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అవినీతి లేని అంకిత భావం అవసరం మని ఆర్‌విఇఒ పూజిత సూచించారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ వారోత్సవాలను ఆ శాఖ ఆర్‌విఇఒ నీలంపూజిత సోమవారం రామలింగేశ్వరనగర్‌లోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు ఆ సంస్థకు సంబంధించిన ప్రతిజ్ఞను కార్యాలయ అధికారులు సిబ్బందితో కలిసి చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అవినీతి వద్దు దేశంకోసం అంకితభావంతో మెలగాలని నినాదంతో ఈ వారోత్సవాలను కేంద్ర విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ డిజి కుమార్, విశ్వజిత్ నేతృత్వంలో జిల్లాలో ఈనెల 30 నుంచి నవంబర్ 5వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ శాఖ గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో భాగంగా విద్యాసంస్థల్లో వక్తృత్వ వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.విజిలెన్స్ సిఐలు కేశవరెడ్డి, నాగరాజు యాదవ్, పూల రామకృష్ణ, సునీల్, ఎస్ఐ హనుమంతయ్య, అగ్రికల్చర్ ఆఫీసర్ రూపస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌విఇఒ నీలం పూజిత



మాట్లాడుతున్న కాకర్ల శాంతి కుమార్

ప్రతిఒక్కరు విద్యావంతులు కావాలి

సమాజంలోని ప్రతి ఒక్క ఉన్న వనరులను ఉపయోగించుకుని విద్యావంతులు కావాలని కర్నూలు ఓల్డ్ టౌన్ సిఐ పవన్‌కుమార్, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.శాంతికుమార్ , ఊట్ల రమేష్‌కుమార్ సూచించారు. కర్నూలు ఓల్డ్ టౌన్ 5వ వార్డు నాగుల కట్ట దగ్గర సివిల్ రైట్స్ డే నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నెల 30,31న జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో పౌర హక్కుల దినాన్ని నిర్వహించుకోవాలనే చట్టం 1955 వచ్చిందన్నారు. తద్వారా పౌరులు సమాజంలో వారికున్న హెచ్చుత గ్గులను, అసమానతలను తొలగించుకోవడానికి సివిల్‌రైట్స్ డే ఉపయోగ పడుతుందన్నారు. చదువుతోనే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు.



ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన, ఇతర అధికారు

నవంబరులో ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నవంబర్ 3,4,5 వ తేదీల్లో కర్నూలు నగరం లోని రావూరి గార్డెన్‌లో ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేపలు, రొయ్యల వినియోగం పెంచడం, వాటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడం కోసం ఈ ఫిష్ - ఫ్రాన్స్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి కల వారు మత్స్య రంగంలో గల ఉపాధి అవకాశాల గురించి కూడా తెలుసుకోవచ్చని సూచించారు. నగర ప్రజలు ఈ ఫెస్టివల్ లో పాల్గొనాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఉపసంచాలకులు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

భూదందాపై రూ.28 లక్షల జరిమానా?

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ మండలంలోని సలీమ్ శంకర్ ఆక్రమించిన ప్రభుత్వ భూమిలో గ్రీన్‌కో కంపనీకి అక్రమంగా భూదందా జరిగినట్లు గత వారంలో పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగా సిపిఎం జిల్లా ప్రతినిధి బృందం తనిఖీ చేసి గ్రీన్‌కో కంపెనీ చేపట్టిన గాలి మరల ఏర్పాట్లకు దారులు చేసేందుకు గాను, ఇతర ప్రాంతాలకు భారీగా ఎర్రమట్టి తరలించుకొని సొమ్ములు చేసుకున్నట్లు మీడియాకు తెలిపారు. దీంతో భూములు అన్యాక్రాంతం చేయడమే కాకుండా భూదందాతో ప్రభుత్వానికి భారీ గండి తప్పదని జరిమానా వేయాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు మైనింగ్ యంత్రాంగం స్పందించి అక్రమంగా మట్టి తరలించి సొమ్ముచేసుకున్న వారికి రూ.28 లక్షల జరిమానా విధించినట్లు విశ్వసనీయ సమాచారం.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి-గూడూరు

గూడూర్ డంపుయాడ్ దగ్గర ఆదివారం గుర్తుతెలియని వాహనంఢీ కొట్టి ఒకరు మతి చెందారు. గూడూరు మండలం మునగాల గ్రామానికి చెందిన బి.నాయుడు గూడూరులో బందులు ఇంటికి వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడని భార్య పుష్పావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనభర్త జెసిపి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విక్టరీ బాబును పరిశీలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాథమిక విద్యా వ్యవస్థను

యథాతథంగా కొనసాగించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రాథమిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలో ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్‌కు యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిఒ 117 ద్వారా రాష్ట్రంలోని ప్రాథమిక విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య అందాలంటే ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులపై పనిభారం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దావీదు, గాదెలింగప్ప, నరసింహులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లారి నాగరాజు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కౌలన్న, శ్రీనివాసులు, మల్లికార్జున, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, రాఘవేంద్ర, నరసయ్య గౌడ్, జి.బాబు, కె.నాగరాజు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రామాంజనేయులు, రంగన్న, చంద్రపాల్, శంకరయ్య, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

- జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య

ప్రజాశక్తి - ఆదోని


గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

ప్రతి ఒక్కరూ సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య తెలిపారు. జెవివి ఆధ్వర్యంలో సైన్స్ సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న చెకుముకి పోటీల గోడపత్రికలను నెహ్రూ మెమోరియల్, మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం విడుదల చేశారు. మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, హలీం సిద్ధికి మాట్లాడారు. జెవివి చెకుముకి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి, కుతూహలం ఏర్పడి భవిష్యత్తు తరాలు శాస్త్రీయ దృక్పథం గల సమాజంగా రూపాంతరం చెందుతుందని తెలిపారు. జెవివి జిల్లా అధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ... జెవివి 33 ఏళ్ల నుంచి తెలుగు రాష్ట్రాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెకుముకి సైన్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని, పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షకు నామమాత్రపు రుసుం రూ.10 చెల్లించి ఉంటుందని తెలిపారు. నవంబర్ 10న పాఠశాల స్థాయి పరీక్ష ఉంటుందని, పాఠశాల స్థాయి విజేతలు నవంబర్ 30న జరిగే మండల స్థాయి పరీక్షకు అర్హత సాధిస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు గాదిలింగప్ప, శ్రీనివాసులు, రామాంజనేయులు, నరసయ్య గౌడ్, రంగన్న, దావీదు, రాఘవేంద్ర, మల్లికార్జున ఉన్నారు.

పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : వైసిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణాభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆరో వార్డులో రూ.20 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయినేజీకి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణంలో తాగునీటి పైపులైన్లు, సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వలసలు వెళ్లరాదు : సర్పంచి

ప్రజాశక్తి - దేవనకొండ


ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచి

గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని వలసలు వెళ్లరాదని సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉపాధి పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోనే పనులు ఉండగా దూర ప్రాంతాలకు వలసలు వెళ్లవద్దని కోరారు. కూలీలకు కూడా దినసరి వేతనం రూ.257 నుంచి 300 వరకు వస్తుందన్నారు. ఎంపిటిసి నామాల శ్రీను, వార్డు సభ్యులు చాకలి బడేసాబ్, వైసిపి నాయకులు బెన్నే వెంకటరాముడు, కురువ మల్లేష్, ముంత ఏసేపు, చాకలి తిమ్మప్ప, సిపిఎం నాయకులు కట్ల పరమేష్, మహబూబ్ బాష, ఫీల్డ్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

జాడ లేని వాన..!

- నెల దాటినా కురవని వర్షం
- పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు
- పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదు

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతేడాది అనావృష్టి, అతివృష్టి వల్ల రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతులు భావించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవక పంటు ఎండుముఖం పట్టాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల పాలయ్యారు. కనీసం రబీ సీజన్‌లోనైనా వర్షాలు కురిసి పంటలు పండుతాయని రైతులు ఆశపడ్డారు. పదునైన వర్షం ఒక్కటి కూడా కురవలేదు. పంటలు ఎండిపోతున్నాయి.





చిప్పగిరి మండలంలో మొత్తం సాగు భూమి 74,157.38 ఎకరాలు. ఖరీఫ్ సాగు 18,500 ఎకరాలు. మండలంలో రబీ సీజన్‌లో వేసే పంటలపైనే రైతులు అధిక ప్రాధాన్యత కనబరుస్తున్నారు. రబీ సీజన్‌లో ప్రధానంగా పప్పు శనగ, జొన్న, పొద్దు తిరుగుడు పంటలను సాగు చేశారు. ఎక్కువ భాగం పప్పు శనగ పంటనే సాగు చేస్తున్నారు. సెప్టెంబర్‌లో కురిసిన కొద్దిపాటి వర్షానికి రైతులు నల్లరేగడి పొలాల్లో పప్పు శనగ పంటను సాగు చేశారు. విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు లేక మొలకెత్తిన పైరు ఎండ వేడిమికి భూమి పొరల్లోనే ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరా పప్పు శనగ విత్తనం వేసుకోవాలంటే మొత్తం పెట్టుబడి కనీసం రూ.8 వేలు నీళ్ల మందులు మినహాయించి అవుతుందని రైతులు తెలుపుతున్నారు. మండలంలో ప్రధానంగా చిప్పగిరి, కుందనగుర్తి, నేమకల్లు, బెల్డోనా, నగరడోనా, ఏరూరు, గుమ్మనూరు, దౌల్తాపురం గ్రామాలలో దాదాపు 70 శాతం పప్పు శనగ పంటపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఈ రెండు నెలల్లో మంచి తేమ గల వర్షం కురవకపోడంతో పంటలు పండుతాయో లేదోనని రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. సాగు చేసిన పప్పు శనగ పైరు ఎండిపోతున్నా వర్షం వస్తుందనే ఆశతో మళ్లీ అప్పులు చేసి నీళ్ల మందులు తెచ్చి పైరుకు స్ప్రే చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దెబ్బతిన్నామని, కనీసం రబీ సీజన్‌లోనైనా పంటలు వస్తాయనుకుంటే ఇప్పటివరకు ఆ జాడ కూడా కనబడడం లేదని రైతులు వాపోతున్నారు.

ఖరీఫ్, రబీ పంటల్లో నష్టపోయాం

- రైతు అశోక్, నేమకల్లు గ్రామం



నాకున్న పొలంలో ఖరీఫ్ సీజన్‌లో ఐదు ఎకరాలు పత్తి సాగు చేశాను. రబీలో మూడు ఎకరాల్లో పప్పు శనగ విత్తనం సాగు చేశాను. రెండు పంటలకు కూడా అప్పు చేసి దాదాపు రూ.70 వేలు దాకా పెట్టుబడి పెట్టాం. పత్తి పంట వేసి నాలుగు నెలలు కావస్తున్నా వర్షం లేనందున కాయ ఏపుగా రావడం లేదు. పప్పు శనగ మొలకెత్తిన పైరే ఎండ వేడిమికి తట్టుకోలేక ఎండిపోతోంది. రూ.వేలుకు వేలు పెట్టుబడులు పెట్టి పంటలు చేతికి రాకపోతే మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

సంక్షేమమే ధ్యేయంగా వైసిపి పాలన

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం గోనెగండ్లలోని సచివాలయం-2 పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' ప్రారంభించారు. ఉదయం 7 గంటలకు మొట్టి వీధిలో ప్రారంభమైన కార్యక్రమం ఒంటయ్య దర్గా, దొడ్డిచేను వీధుల్లో సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు, వాటి ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయా వీధుల్లో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పే వినతులను గ్రీవెన్స్‌లో పొందుపరచాలని సంబంధిత సచివాల సిబ్బందికి సూచించారు. తమ వీధిలో తాగునీరు నాలుగు రోజులకోసారి వస్తోందని పేట మాబు సాహెబ్ తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జల జీవన్ యోజన పథకం కింద ఇంటింటికీ ఉచిత కుళాయిల ద్వారా నీరు ఇచ్చేందుకు రూ.2 కోట్లు కేటాయించామని, అందులో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా ప్రారంభమయ్యాయని, త్వరలోనే గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుందని నాయకులు తెలిపారు. ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఇఒఆర్‌డి నగేష్, టి.బందే నవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి, దొరబాబు నాయుడు, కనికె పద్మనాభం, బగిలి రఫీ, చికెన్ రాజా, పూజారి కౌలుట్లయ్య, అచ్చుగట్ల బాబు, గృహ సారథులు బగిలి ఉస్మాన్, చాకలి శివ పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

దౌర్జన్యంగా వేరుశనగ పంట తొలగింపు

- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ప్రజాశక్తి - దేవనకొండ


దున్నేసిన వేరుశనగ మొక్కలను చూపిస్తున్న రైతు

మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన రైతు బోయ గంగన్నకు సంబంధించిన నెలరోజుల వేరుశనగ పంటను దౌర్జన్యంగా కొందరు ట్రాక్టర్‌తో తొలగించారు. సోమవారం బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... కరివేముల రెవెన్యూ పరిధిలో రైతు బోయ గంగన్నకు 1.34 ఎకరాల పట్టాదారు పొలం ఉంది. ఆ పొలానికి ఆనుకొని ఉన్న కొంత ప్రభుత్వ భూమిని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కరివేముల గ్రామానికి చెందిన ఎరుకల రామాంజనేయులు, ఆయన కుమారుడు రవి మరి కొంతమంది వ్యక్తులు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ట్రాక్టర్‌తో రెండెకరాల పొలంలోని నెలరోజుల వేరుశనగ పంటను దున్నేశారు. దౌర్జన్యంగా వేరుశనగ పంటను తొలగించడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

వచ్చే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదోని గడ్డపై టిడిపి జెండాను ఎగరవేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జెబి గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిష్మా పెరిగిందని తెలిపారు. ఆయన నాయకత్వంలో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఊపిరి ఉన్నంతవరకు తాను టిడిపిలోనే ఉంటానని, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బయటకొస్తారని, ఆదోని ప్రజల, టిడిపి కార్యకర్తల మనసుల్లో ఉన్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరును ప్రకటించడం తథ్యమని పరోక్షంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపిని బలహీనపరచాలని కుట్ర చేసి జగన్ ప్రభుత్వం చంద్రబాబును జైల్లోకి పెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో పార్టీ మరింత పటిష్టంగా తయారైందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా టిడిపి అఖండ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే జనసేన, టిడిపి నాయకులు సమిష్టిగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప గతంలో టిడిపిలో పని చేశారని, ఇటీవల జనసేన పార్టీలో చేరిన రమేష్ యాదవ్ సైతం పాత మిత్రుడేనని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు, బసాపురం రామస్వామి, తెలుగు యువత నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, జెబి.రంగన్న, సున్నంబట్టి లక్ష్మన్న, ముస్లిం, మైనార్టీ నాయకులు అప్సర్ బాష, బుద్ధారెడ్డి, రంగన్న, ఆరెకల్ రామకృష్ణ, మారుతి రావు, దొడ్డనకేరి శివప్ప, మండల అధ్యక్షులు బసవరాజు, తిమ్మప్ప, వెంకటేష్, రాజు, జైరామ్, నెట్టేకల్ రవీంద్ర సింగ్, రాముడు, ఈరన్న, వీరారెడ్డి, కపటి శివ, జీవన్, షణ్ముఖ, వీరేష్, కొమరం భీమ్ వీరేంద్ర, బసాపురం ప్రభాకర్, రమణ, మదిరే పీరా, వీరేష్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

అధికారి రాకపోవడంతో

వేలం పాటలు వాయిదా

ప్రజాశక్తి - కౌతాళం



శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో వేలం పాటలు వాయిదా పడ్డాయని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. పుణ్యక్షేత్రంలో తలనీలాలు పోగు చేసుకోవడానికి, పాత కార్యాలయం డమలిష్ చేయడానికి బహిరంగ వేలం పాటలు సోమవారం నిర్వహించాల్సి ఉందని తెలిపారు. జిల్లా ఎండోమెంట్ కార్యాలయం నుంచి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనివార్య కారణాల వల్ల రాకపోవడంతో వేలం పాటలు వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ వేలం పాటలు ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటన ద్వారా తెలియజేస్తామని తెలిపారు. వేలంపాటల్లో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలంపాటదారులు వెనుదిరిగారు. వెంకటేష్ పాల్గొన్నారు.

2న ఆఫ్ క్యాంపస్ నియామకాలు

- రావుస్ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి


కరపత్రాన్ని విడుదల చేస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని రావుస్ డిగ్రీ కళాశాలలో నవంబర్ 2న రావుస్ కళాశాల ఆధ్వర్యంలో 'హెట్రో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ' వారితో నిరుద్యోగులకు ఆఫ్ క్యాంపస్ నియామకాలు జరగనున్నాయని రావుస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి తెలిపారు. సోమవారం నియామకాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏదైనా డిగ్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బిఫార్మసీ, ఐటిఐ ఫిట్టర్ డిప్లొమా ఇన్ మెకానికల్ చదివిన వారు ఈ 'ఆఫ్ క్యాంపస్' నియామకాలకు అర్హులని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, నోడల్ ఆఫీసర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నవోదయలో దరఖాస్తు తేదీ పొడిగింపు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో చేరేందుకు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 9వ, 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవటానికి నవంబర్ 7 వరకు పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు https://navodaya.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వారై ఉండాలి. **దరఖాస్తుకు చివరి తేదీ :** నవంబర్ 7, 2023. **ఎంపిక పరీక్ష తేదీ :** 10-02-2024 (శనివారం). ఇతర వివరాలకు https://navodaya.gov.in లేదా www.nvsadmissionclassnine.in https://cbseitms.nic.in/2023/jnvxi/registrationclassXI/registrationclassXI సంప్రదించాలని కోరారు.

విలేకరులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

- తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

విలేకరులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ వీరేంద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో వర్కింగ్ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

సెల్ ఫోన్ దుకాణం దగ్ధం


- రూ.4 లక్షలు నష్టం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలోని రాయలసీమ గ్రామీణ బ్యాంకు సమీపంలో ఓ సెల్ ఫోన్ దుకాణం దగ్ధమైంది. సెల్ ఫోన్ దుకాణం ప్రమాదవశాత్తు దగ్ధమైందా..? లేక ఎవరైనా దగ్ధం చేశారా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. సెల్ ఫోన్ దుకాణం తాళాలు పగులగొట్టడంతో ఈ అనుమానాలకు తావిస్తోంది. సెల్ ఫోన్ దుకాణం దగ్ధమైన సమాచారాన్ని పత్తికొండ అగ్నిమాపక కేంద్రానికి తెలపడంతో ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. సుమారు రూ.4 లక్షలు విలువ చేసే సామగ్రి దగ్ధమైనట్లు దుకాణ యజమాని రామచంద్ర సోమవారం తెలిపారు. బాధితుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆస్పరి



విద్యుదాఘాతానికి గురై చిరుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన మహానంది (53) సోమవారం మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామానికి చెందిన మహానంది స్థానిక వెంకటేష్ హోటల్ వద్దకు రోజులాగే టీ తాగేందుకు ఉదయాన్నే వెళ్లారు. హోటల్ షెడ్డుపై విద్యుత్ తీగ తెగి పడి ఉండడంతో సపోర్టుగా ఉన్న ఇనుప పైపును పట్టుకున్నారు. విద్యుదాఘాతానికి గురై అక్కడే కింద పడి కుప్పకూలారు. మృతునికి భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

వాల్మీకి ద్వారా.. శ్రీరాముని గొప్పతనం తెలిసింది

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వాల్మీకి మహర్షి ద్వారా శ్రీరాముని గొప్పతనం ప్రపంచానికి తెలిసిందని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నూతనంగా వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం అనే గొప్ప కావ్యం వల్లనే శ్రీరాముడు సమస్త మానవాళికి ఆదర్శ ప్రాయుడయ్యారని చెప్పారు. వాల్మీకులంతా కలిసి ఇలాంటి గొప్ప కవి వాల్మీకి విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. అంతకుముందు రాఘవేంద్ర సర్కిల్ చేరుకున్న పీఠాధిపతులకు బాణసంచా పేల్చి, శాలువా, పూలమాలలు వేసి పుష్పాభిషేకంతో ఘనంగా ఆహ్వానించారు. శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి కార్యాలయ అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి, సిబ్బంది భీమాచార్, మురళీ స్వామి ఉన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణలో ప్రముఖులు

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా టిటిడి బోర్డు సభ్యులు వై.సీతారామిరెడ్డి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున హాజరయ్యారు. విగ్రహావిష్కరణలో టిడిపి గ్రూపు విభేదాలు మరోసారి బయట పడ్డాయి. టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, అశోక్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, చావిడి వెంకటేష్, సూగూరు నాగేష్ నాయుడు హాజరయ్యారు. అంతకుముందే టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య గ్రూపులోని చూడి ఉలిగయ్య, పల్లెపాడు రామిరెడ్డి, కోసిగి ముత్తు రెడ్డి, కెడిసిసి మాజీ ఛైర్మన్, మాజీ ఎంపిపి మాధవరం రామిరెడ్డి కుమారులు రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న ఒకేసారి హాజరయ్యారు. ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యులు గుడిసె కృష్ణమ్మ ఒంటరిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ సభ్యులు డిసి.తిమ్మప్ప, దుళ్లయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఖాసీం, వీరేష్, మేకల నరసింహ అతిథులను బాణసంచా పేల్చుతూ శాలువా, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాల్మీకి నాయకులు, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర మాట్లాడారు. వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించిన రాంపురం రెడ్డి సోదరుల సహకారం మరువలేదని తెలిపారు. అంతకుముందు వాల్మీకి కుటుంబానికి చెందిన మహిళలు కళశాలతో ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా వచ్చి వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


విగ్రహావిష్కరణలో పాల్గొన్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు


విగ్రహావిష్కరణలో పాల్గొన్న తిక్కారెడ్డి, నాయకులు


విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైసిపి నాయకులు

పరిమితికి మించి ప్రయాణం

- వరుసగా ఆటో ప్రమాదాలు - పోలీసుల బాధ్యత రహిత్యమే కారణమా..?

ప్రజాశక్తి - ఆస్పరి


ప్రమాదానికి గురైన ఆటో (ఫైల్)

ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల ఆస్పరి గ్రామం నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం తీసుకెళ్తూ ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు గురి చేస్తున్నారు. అప్పే ఆటోలో నలుగురు మాత్రమే ఎక్కించుకోవాలి. ఆటో డ్రైవర్ 20 మందికి పైగానే ఎక్కిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

వరుసగా ఆటో ప్రమాదాలు

మండలంలోని జోహారపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గతనెల 7న దాదాపు 30 మంది కూలీలను ఎక్కించుకొని దేవనకొండ మండలంలోని రైతులకు పత్తి కోతకు బయల్దేరారు. అటికేల గుండు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో కూలీల ఆటోను ఢీకొనడంతో ఆస్పరికి చెందిన వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, జోహారపురం గ్రామానికి చెందిన కర్ణ, ఎర్రన్న, సంతోషమ్మ, అంజనమ్మ అనే కూలీలకు కాళ్లు, చేతులు విరిగాయి. ఈనెల 27న నలకదొడ్డి గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో అరికెర సాయి, బుక్కా వెంకటేష్‌లు కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 29న ఆస్పరి గ్రామానికి చెందిన కూలీలు దేవనకొండలో కూలి పనులకు వెళ్తుండగా అట్టేకల్లు గ్రామ సమీపంలో ఆటో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలకు చేతులు విరిగాయి. చాలా మంది ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహన చోదకులకు లైసెన్సులు కూడా లేవు. వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

పోలీసుల బాధ్యత రహిత్యమే కారణమా..?

మండలంలో ఇటీవల జరుగుతున్న ఆటో ప్రమాదాలకు పోలీసులు బాధ్యత రహిత్యమే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. రోజూ ఉదయం ఆటోల్లో కూలీలు కింద, పైన ఎక్కించుకొని వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడమే లేదు. ప్రమాదాలు జరుగుతున్నప్పుడు హడావిడి చేస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానిక సమస్యలపై వైసిపి నాయకులను నిలదీయండి

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో 'గడపగడపకు' కార్యక్రమంలో పాల్గొనే వైసిపి నాయకులను గ్రామంలోని సమస్యలపై నిలదీయాలని టిడిపి యూత్ మండల అధ్యక్షులు రంగస్వామి నాయుడు, మండల మైనారిటీ నాయకులు నూర్ అహ్మద్ కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మొట్టిగేరిలో ప్రజలకు బియ్యం పంపిణీ చేసే వాహనాలు 2 నెలలుగా కనిపించటం లేదని చెపితే ఒక నెల వాహనం చెడిపోయిందని తెలిపారని అన్నారు. మరో నెల సర్వర్ మొరాయిస్తుందని అంటున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుపై, రైతుల వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇస్తామన్న నేతలు ఇప్పుడు కేవలం 7 గంటలు ఇస్తున్నారని తెలిపారు. ఎల్ఎల్‌సి కాలువ ద్వారా రావాల్సిన నీటిని రాకుండా పొలాలను ఎండగొడుతున్నారని, గోనెగండ్ల మండలాన్ని కరువు ప్రాంతంగా ఎందుకు ప్రకటించలేదో ప్రశ్నించాలని చెప్పారు. రాంపురం రంజాన్, భారతం రహమతుల్లా, పూజారి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

50 కుటుంబాలు వలస

ప్రజాశక్తి - కౌతాళం


వలస వెళ్తున్న కుటుంబాలు

మండలంలోని మధిరె గ్రామంలో 50 కుటుంబాలు సోమవారం వలస వెళ్లాయి. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులకు నష్టాలు మిగిలాయి. పంట పొలాలు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామాల్లో పనులు లేకపోవడంతో వలసలు ప్రారంభమయ్యాయి. మధిరె గ్రామం నుంచి బొలెరో వాహనంలో 50 కుటుంబాలు గుంటూరుకు వెళ్లాయి. గ్రామాల్లో పనులు లేకపోవడంతో వలస వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సాగునీరందిస్తాం - రైతులు సహకరించాలి

- ఎల్ఎల్‌సి ఇఇ శైలేశ్వర్

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని తుంగభద్ర దిగువ కాలువ ఇఇ శైలేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్ర సరిహద్దు నుంచి దిగువ కాలువపై పర్యటించారు. 74, 75, 75 బి, కౌతాళం మేజర్, మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ కాలువలకు వారపు బంద్ పూర్తి కావడంతో సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య ఏర్పడిందన్నారు. మన వాటా కింద రావాల్సిన నీటి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతులు కూడా సహకారం అందిస్తే ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా సాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. వైసిపి మండల నాయకులు ఏకం రెడ్డి ఆయకట్టు రైతుల పరిస్థితి తుంగభద్ర దిగువ కాలువ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వరి, మిరప పంటలకు సాగునీరందించి ఆదుకోవాలని కోరారు. పంటలు చేతికొచ్చే స్థితిలో ఉన్నాయని, మరో రెండు తడులు సాగునీరందితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల నుంచి సహకారం అందిస్తామని, రైతులకు మాత్రం సాగునీరు అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. ఎల్ఎల్‌సి డిఇ మహ్మద్ సైఫుల్లా, సిఐ ఎరిషావలీ, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


కాలువపై పర్యటిస్తున్న ఇఇ శైలేశ్వర్

ప్రజాశక్తి
మంగళవారం 31 అక్టోబర్ 2023
5
నంద్యాల





రైతులు తెచ్చిన పత్తిని పరిశీలిస్తున్న జిల్లా మార్కెటింగ్ అధికారి రహిమాన్ తదితరులు

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా మార్కెటింగ్ అధికారి రహిమాన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎస్.అబ్దుల్ రహిమాన్ సూచించారు. సోమవారం నంద్యాలలో వ్యవసాయ మార్కెటింగ్, సిసిఐ సంయుక్త ఆధ్వర్యంలో మురారి పవన్ ఆగ్రో టెక్ జిన్నింగు మిల్లు, మర్మ లక్ష్మీ నారాయణ కాటన్ ఇండస్ట్రీ, ఏఎన్‌సి ఆగ్రో మిల్లులలో పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెటింగ్ అధికారి రహిమాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ శేషి రెడ్డి, సిసిఐ ఇన్‌చార్జ్ దారప్ప, నిర్వాహకులు రమణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం మార్కెటింగ్ అధికారి మాట్లాడుతూ రైతులు పత్తిని అమ్మకానికి తెచ్చుకొనే ముందుగానే ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి ఆర్‌బికెలో రిజిస్ట్రేసన్ చేయించుకోవాలని సూచించారు. టోకెన్ పొందిన తర్వాత మాత్రమే రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలన్నారు. తేమ 8 శాతం మాత్రమే ఉండాలని, ఎక్కువ ఉంటే ప్రతి ఒక్క శాతానికి 55.50 పైసల చొప్పున ధర తగ్గుతుందని, 12 శాతం కంటే తేమ ఉన్న పత్తిని సిసిఐ కొనుగోలు చేయదన్నారు. క్వింటాకు కనీస మద్దతు ధర పొడవు పింజ రకం కు రూ.7,020, పొట్టి పింజ రకం రూ.6,600లకు అమ్ముకోవచ్చునని తెలిపారు. మధ్యవర్తులు, దళారుల వద్దకు వెళ్లకుండా రైతులు పత్తిని కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేసిన జిన్నింగు మిల్లులు, మార్కెట్ యార్డుల వద్దకు ఎవరైనా దళారులు, మధ్యవర్తులు వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

- జయప్రదం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర నేడు నంద్యాలకు మధ్యాహ్నం 3 గంటలకు చేరుకుంటుందని, ఈ సందర్భంగా రాజ్ థియేటర్ దగ్గర జివి షాపింగ్ మాల్ ఎదురుగా జరిగే బహిరంగ సభలో కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ కోరారు. సోమవారం నంద్యాలలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లపాటు ఇస్తామని, కర్నూల్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వీటి గురించి ఏమాత్రం పోరాటం చేయకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టుకోకుండా బిజెపి విధానాలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీలు హామీల అమలు కోసం పోరాటం గానీ, బిజెపిపై నోరు మెదపడం లేదన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎంను బలపరచాలని, ప్రజాతంత్ర వామపక్షవాదులను ప్రజలు ఆదరించాలని కోరుతూ సిపిఎం మేనిఫెస్టోని ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్లడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 15న చలో విజయవాడ లక్షలాదిమంది ప్రజలతో బహిరంగ సభ కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక ప్రజల్లోకి తీసుకుపోనుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.నాగరాజు, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కె.మహమ్మద్ గౌస్, లక్ష్మణ్, పి.వెంకట్ లింగం తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నేడు నందికొట్కూరులో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వర రావు కోరారు. నందికొట్కూరు మార్కెట్ యార్డ్‌లో సిఐటియు మండల కార్యదర్శి గోపాల కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పకీరు సాహెబ్, ఆంజనేయులు, నాగన్న, హమాలి కార్మికులు స్వాములు, మద్దిలేటి, పాండు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన సమస్యల వేగవంత పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతవారం చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్లో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తోందని అభినందించారని, ఈ మేరకు జిల్లా అధికారులందరికీ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత ఉత్సాహంతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇక నుండి ప్రతి సోమవారం రెండు డిపార్ట్మెంట్లు ప్రజలు అసంతృప్తి చెందిన అంశాలు, రీఓపెన్ కేసులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ఆదేశించారు. స్పందన ఈకేవైసీపై శాఖల వారీగా వారం వారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. వేలిముద్రలు, ఐరిష్ పడని వారికి సంబంధిత ఎంపీడీవో, తాసిల్దార్ నుండి డేటా కలెక్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ గైర్హాజరుపై షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 195 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్-ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.



ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నాటు బాంబులు స్వాధీనం

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని వనములపాడు గ్రామంలో ఐదు నాటు బాంబులు స్వాధీనం చేసుకున్నట్లు నందికొట్కూర్ రూరల్ సిఐ విజయ్ భాస్కర్, ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో దొరికిన బాంబుల కేసులో ముద్దాయిగా ఉన్న ముచ్చుమర్రి గ్రామానికి చెందిన డబ్బా వెంకట స్వామిని విచారించగా వనములపాడు గ్రామంలోని అన్నపూర్ణమ్మ దేవాలయం సమీపాన బకెట్‌లో ఐదు బాంబులు ఉన్నాయని చెప్పాడన్నారు. జాగిలాలను పిలిపించి సోదాలు చేయగా 5 నాటు బాంబులు దొరికాయని తెలిపారు. గతంలోనూ 26 నాటు బాంబులు దొరికాయి. వీటిని ముచ్చుమర్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుబాంబుల బకెట్

పేదల భూములకు పట్టాలివ్వాలి

- సిపిఎం, వ్యకాసం నేతలు డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట పేద రైతులు ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బండి ఆత్మకూరు మండలం సింగవరం, ఏ.కోడూరు గ్రామాలలో 20 సంవత్సరాల నుంచి పేదలు అనుభవిస్తున్న భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల పేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ పేదల ఆధీనంలోని భూములకు పట్టాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం 15 సంవత్సరాల నుండి అనుభవిస్తున్న సింగవరం పేదలకు పట్టాలు ఇచ్చి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏ.కోడూరు గ్రామంలో పోరంబోకు స్థలాల్లో 50 సంవత్సరాలుగా సాగు చేసి జీవనం చేస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, కలెక్టర్, భూ పరిపాలన అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ అనుభవంలో ఉన్న పేదల భూములకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే మండల కేంద్రంలో రహదారులను నిర్బంధం చేసి ఆందోళన చేపడతామన్నాఉ. వ్యకాసం జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా పోరాటాలు నిర్వహించి భూములను సాధించుకోవాలన్నారు. సిపిఎం మండల నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, వ్యకాసం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడులు మాట్లాడుతూ పేదలు కొన్ని సంవత్సరాలుగా అనుభవంలో ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల అవినీతికి పాల్పడి ఆన్లైన్లో అనుభవంలో లేనివారి పేర్లను నమోదు చేశారని, వీటిపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పేద రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పేద రైతులు, నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ విద్యార్థులు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగేపు నాగేశ్వరావు, విద్యాధికారి లక్ష్మి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెలలో విజయవాడలో జరగబోయే పోటీలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని బి.సంధ్య రాణి, రెండవ సంవత్సరం విద్యార్థి బి.వంశీ పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయ బృందం ఎంఇఒ లక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఫత్తేనగర్‌లో పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని ఫతేనగర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ బనగానపల్లె ఏడిఏ డాక్టర్ పి.మారుతి సకారం, యాగంటిపల్లె పశువైద్యదికారి డా.యం.బ్రహ్మానంద రెడ్డిల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఆవులకు, ఎద్దులకు రెండోసారి గొంతు వాపు టీకాలు వేశారు. పేలు, పిరుదుల బెడద ఎక్కువగా ఉండడంతో సామూహికంగా నివారణకు బూటాక్స్ , స్ప్రే చేసినట్లు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పసుపుల పశువైద్యధికారి డాక్టర్ ఎం.రామకుమార్ రెడ్డి, సిబ్బంది వి.నీలకంటం, పి.రామకృష్ణుడు, గ్రామ పెద్దలు శివకృష్ణ యాదవ్, గోపాల్ రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : చైర్మన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని విజయ పాల డైరీ చైర్మన్ ఎస్వి జగన్ మోహన్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ స్వరూప అన్నారు. సోమవారం వారి స్వగృహంలో 38 మందికి టిడ్కో గృహాల పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలు అందజేస్తున్న దృశ్యం

మెగా సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - బనగానపల్లె

నవంబర్ 3, 4, 5వ తేదీలలో కర్నూల్ టౌన్ రావూరి గార్డెన్‌లో జరిగే మెగా సీ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణిలు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలన్నింటిని కలిపి మెగా సీ ఫుడ్ ఫెస్టివల్‌ను భూమి ఆర్గానిక్స్, మత్స్యశాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నంద్యాల ప్రాంత ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఫిష్ ఆంధ్ర బ్రాండ్ పథకం ద్వారా లక్ష నుండి 50 లక్షలు గల యూనిట్లను, కోటి రూపాయల విలువ గల యూనిట్లుగా ఏర్పాటు చేసుకోవాలని పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పామన్న, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ శిరోమణి, బనగానపల్లె సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నవంబర్ 3 నుండి 5వ తేది వరకు కర్నూలులోని రావూరి గార్డెన్స్‌లో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రజలు పాల్గొని సీ ఫుడ్ రుచులను ఆస్వాదించాలని, విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంతో మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

రూ.10.10 కోట్లతో డోన్‌లో అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ మున్సిపాలిటాలోని 32 వార్డులలో వివిధ రకాల నిధులు రూ.10 కోట్ల 10 లక్షలతో పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. సోమవారం డోన్ పట్టణంలోని 11వ వార్డులో రూ.37 లక్షల నిధులతో రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించామని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ సిఎండిఎఫ్ గ్రాంట్స్, గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులతో పాటు ఎమ్మెల్యే కోటా స్పెషల్ గ్రాంట్స్ ద్వారా 32 వార్డులకు నిధులు కేటాయించి నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 11 వార్డులలో పనులు పూర్తయ్యాయని, మిగతావి రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. ఆర్థిక మంత్రి డోన్ మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు మంత్రి సహకారంతో నిర్వహించామని అన్నారు. రాష్ట్రంలోనే డోన్ మున్సిపాలిటీని ఆదర్శంగా చూడాలనే లక్ష్యంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవచూపారని, భవిష్యత్తులో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. డ్రెయినేజీ, సిసి రోడ్లు, కల్వర్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో చైర్మన్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఇ రసూల్, ఎఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్

ఐఎంఎ మిషన్ పింక్ హెల్త్ విభాగం నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల

ఐఎంఎ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం సర్వసభ్య సమావేశంలో రానున్న రెండు సంవత్సరాలకు సోమవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నాఉ. అధ్యక్షురాలుగా డాక్టర్ నెరవాటి అరుణ కుమారి, గౌరవాధ్యక్షురాలుగా డాక్టర్ నాగమణి, కార్యదర్శులుగా డాక్టర్ శైలజ, డాక్టర్ సుసుమ, కోశాధికారిగా డాక్టర్ రాధిక, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నాగ రేఖ, డాక్టర్ చంద్రకళ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ అరిఫాబాను, డాక్టర్ అనితతో పాటు కార్యవర్గ సభ్యులుగా వైద్యులు లక్ష్మీ ప్రసన్న, జ్యోతి వాణి, భారతి, కిరణ్మయి, స్ఫూర్తి, తనూజ, సింధు, అనూష, హారిక, జాస్మిన్ సుల్తానా, అనూష రాఘవేంద్ర, ఆశాలత, శ్రీవాణి, దివ్య తేజ, మధు ప్రీతిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ అభినందించారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ పెద్దిరాజు

14 నుండి కార్తీకమాసం ఉత్సవాలు

- శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో నవంబర్ 14వ తేదీ నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు సోమవారం ఆయా సెక్షన్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు. కార్తీక మాసంలో ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి, బహుళ ఏకాదశిలు, ప్రభుత్వ సెలవు దినాలలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది కావున ఆయా ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా పాతాళ గంగలో మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, పాతాళగంగ మెట్ల మార్గంలో మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. భక్తులకు మంచినీటి సరఫరా, వసతి, సౌకర్యవంతమైన దర్శనం, స్వామి అమ్మవార్ల ఆర్జిత సేవలు, ఆలయ వేళలు, క్యూలైన్ల నిర్వహణ, రద్దీ క్రమబద్ధీకరణ, ట్రాఫిక్, పారిశుధ్యం, పార్కింగ్, సోమవారాలలో లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి, జ్వాలాతోరణం, నదీమతల్లి హారతి, ఆకాశదీపం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు, దర్శనం ఏర్పాట్లు, ఆర్జిత సేవలు, అన్న ప్రసాద వితరణ, లడ్డు ప్రసాదాలు, పాతాళగంగాలో ఏర్పాట్లు, కేశఖండన శాలలో ఏర్పాట్లు, సూచిక బోర్డులు, శివసప్తహ భజనలు వాటిపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ఇఒ తెలిపారు. కార్యక్రమంలో ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు తదితరులు పాలొన్నారు.

చదరంగంలో శాంతిరాం విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ విద్యార్థిని హర్షిత జేఎన్టీయూ చదరంగం టీమ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 28న నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన జేఎన్టీయూ అంతర్రాష్ట్ర చదరంగం ఎంపిక పోటీలలో హర్షిత జెఎన్టియు టీంకు ఎంపికైందని తెలిపారు. నవంబరులో తమిళనాడు లా యూనివర్సిటీలో జరిగే పోటీలలో హర్షిత పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, కళాశాల ఎండి శివరాం, హెచ్వోడి మల్లికార్జున రావులు హర్షితను, పిడి చంద్రారెడ్డిని అభినందించారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలంలోని బాధితులకు 12 మందికి రూ.16 లక్షల 50వేల సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలోని ప్రజలందరికీ కుల మత భేదాలు లేకుండా రాజకీయాలు కతీతంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో అర్హత కలిగిన కుటుంబాల అందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, సచివాలయ మండల కన్వీనర్ కుందే తిరుమలేశ్వర్ రెడ్డి, గూని నాగరాజు ,రంగాపురం మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి, సిమెంట్ నగర్ యాకోబు, ముద్ద వరం కుమార్ రెడ్డి జయ ప్రకాశ్ రెడ్డి, దస్తగిరి, చంద్రశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏ కోడూరులో 'మహిళా శక్తి'


మాట్లాడుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని ఏ కోడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం గత ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం అలాంటి కార్యక్రమాలు లేవన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ పథకాలు కొనసాగుతా యన్నారు. లక్ష్మీదేవి అరుణమ్మ మాట్లాడుతూ మహిళా సాధికారిత టిడిపి ప్రభుత్వం తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్ రెడ్డి, జిల్లా నాయకులు తాటి కొండ బుగ్గ రాముడు, ఉస్మాన్ ఖాన్, జాకీర్ఖాన్, మహేష్, వైఐ సుబ్బారెడ్డి, వైవి శ్రీకాంత్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

దేవస్థానం అంగళ్లకు వేలంపాటలు

ప్రజాశక్తి - గడివేముల


వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానము నందు కార్తీక మాసం నుండి సంవత్సరం వరకు టెంకాయలు, టీ, మిఠాయిలు అమ్ముకో వడానికి ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో అంగళ్ళ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో టెంకాయలు అమ్ముకోవడానికి రెండు లక్షల నాలుగు వేల రూపాయలకు, టీ, మిఠాయిలు అమ్ముకోవడానికి రూ.30 వేలకు వేలం పాటపాడారని ఆలయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తుండడంతో ప్రజలు వైసిపి ప్రభుత్వం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రాజ్ థియేటర్ నుండి టేక్కే వరకు కౌన్సిలర్ కాల్వ సరస్వతి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారులకు జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, నంద్యాల మూడవ పట్టణ అధ్యక్షులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుస్సేన్, నాయకులు టైలర్ శివ, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఎస్ఎస్.ఖాద్రి, చిలుకల గురునాద్, శిరిగిరి రమేష్, అడ్వకేట్ మాధవరెడ్డి, సత్యనారాయణ, దేవక్క, సుబ్బారెడ్డి, శంకర్ నాయక్, గెలివి రామకృష్ణ, మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, అల్లాబకాష్, కౌన్సిలర్లు భాస్కర్, కలాం భాష, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, సోమశేఖర్ రెడ్డి, రహంతుల్లా, కిరణ్ కుమార్, పార్థుడు, అధికారులు పాల్గొన్నారు. **చాగలమర్రి** : గతంలో ఎప్పుడూ లేనివిధంగా వైసీపీ పాలనలో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపిపి వీరభద్రుడు, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,ఎంపిటీసి రాజేశ్వరి,వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, గణపతి రెడ్డి,లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,బచ్చు సుబ్రమాణ్యం, హనుమంతరెడ్డి, సుమన్,వేణు,నారాయణరెడ్డి,మాజీ సర్పంచ్ సుబ్బలక్షుమ్మ, జయరామిరెడ్డి, ఎంపీటీసీలు పత్తినారాయణ, లక్ష్మిరెడ్డి, పుల్లయ్య, దస్తగిరి,రాముడు,సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఏఈలు షాజహాను, కొండారెడ్డి, షపివుల్లా, పంచాయితీ కార్యదర్శి స్వప్న,ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కు స్వాగతం పలికిన వైసీపీ నాయకులు


గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి తో కలిసి గోశాలను సందర్శిస్తున్న ఇఒ లవన్న

గోశాలను సందర్శించిన ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం పరిధిలో సంరక్షణలో ఉన్న గోశాలను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పెద్దిరాజు తోపాటు గోసేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇఒ గోసాల గురించి దేవస్థానం చేపట్టిన సంరక్షణ గురించి వారికి వివరించారు. ఇందులో గోవులకు పచ్చి గడ్డి వరి వట్టిగడ్డి సీజనల్ వ్యాధుల గురించి వాటికి వేస్తున్న టీకాల గురించి గోవుల గురించి దేవస్థానం చేపట్టిన చర్ల గురించి వివరించారు. గోవుల నుండి దేవస్థానం తయారు చేస్తున్న విభూతి గో ఆర్క్ ధూప్ స్టిక్ యాంటీ రేడియేషన్ స్టిక్కర్స్ హెూమ పిడకలు మొదలైన గో ఉత్పత్తుల గురించి వివరించారు. గోవుల పట్ల దేవస్థానం చేపట్టిన సంరక్షణ గురించి తెలుసుకున్న గో సేవ ఫౌండేషన్ అధ్యక్షులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులపాట్ల మరిన్ని చర్యలు సంరక్షణకు చేపట్టేందుకు గో సేవా ఫౌండేషన్ సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు శ్రీశైల ప్రభ ఎడిటర్ డాక్టర్ సి అనిల్ కుమార్, గోసాల పర్యవేక్షకులు శ్రీనివాసులు గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

గో సంరక్షణనిధికి విరాళం

శ్రీశైల దేవస్థానం గో సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన గో సంరక్షణనిధికి సోమవారం నాడు విజయవాడకు చెందిన ఆర్.సదాశివ సీతా మహాలక్ష్మీ రూ.1,23,000 విరాళంగా ఆలయ పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతలు శేష వస్త్రాలను ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.


ఆరోగ్య సురక్ష బ్యాగులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : జడ్పిటిసి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపట్టారని జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న అన్నారు. సోమవారం పగిడ్యాల సచివాలయం 3 పరిధిలోని బీరవోలు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. గ్రామాల్లోని ప్రతి సచివాలయ పరిధిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తూ మెరుగైన చికిత్స అవసరమైతే కర్నూలు వైద్యశాలకు రెఫర్ చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్, వైద్యాధికారి డాక్టర్ మోహన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వైసిపి నాయకులు చిమ్మే బిచ్చన్న ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం : మండల పరిధిలోని ఎల్లా వత్తుల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఎల్లా వత్తుల, తుమ్మల కొట్టాల, బీరవోలు గ్రామాల ప్రజలకు ఈసీజీ స్కాన్, బిపి, షుగరు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వైద్య స్టాల్స్‌ను, ప్రత్యేకంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సువర్ణ లత ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బంది ఏర్పాటు చేసినటువంటి చిరుధాన్యాల ఆహార పదార్థాలను ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, సర్పంచి చంద్రమోహన్, ప్రజా ప్రతినిధులు పరిశీలించి రుచి చూశారు. పంచాయతీ సెక్రెటరీలు పాములేటి, షాహినూరు, కళావతి, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన 7వ జిల్లా స్థాయి పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి త్రో బాల్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బహుమతి ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నూల్, నంద్యాల జిల్లాల నుండి 108 టీమ్‌లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానం గుడ్ షెఫర్డ్ నంద్యాల, తృతీయ స్థానం విజ్ఞాన పీఠం–కర్నూల్, బాలుర విభాగంలో ప్రథమ స్థానం శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ద్వితీయ స్థానం విజ్ఞాన పీఠం–కర్నూల్, తృతీయ స్థానం జిల్లా పరిషత్ హైస్కూల్ భాగ్యనగరం క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ బాలుర, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించారు. ముఖ్య అతిదులుగా ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పి. దస్తగిరి రెడ్డి, రామకృష్ణారెడ్డి, డాక్టర్ జి.రవికృష్ణ, చిన్నపరెడ్డిలు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు పి . మౌలాలి రెడ్డి షేక్షావల్లి రెడ్డి పాల్గొని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వ్యాయామ ఉపాధ్యాయ బృందానికి జ్ఞాపికలను అందజేసి వారి సేవలను కొనియాడారు. అతిథులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రతినిధులు ఎపి రెడ్డి, మోహన్ రెడ్డి, నాగరాజు, దివాకర్ శ్రీధర్, విష్ణు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గురురాజా విద్యాసంస్థల అధినేత పి. దస్తగిరి రెడ్డి

చెంచులకు ఆరోగ్య సౌకర్యాలు కల్పిస్తాం

- మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్

ప్రజాశక్తి - ఆత్మకూర్

వైసిపి ప్రభుత్వం నల్లమల ప్రాంతంలో నివాసముంటున్న చెంచు గిరిజన మహిళా గర్భవతులకు బాలింతలకు అన్ని విధాలు గా ఆరోగ్య సౌకర్యాలు కల్పించే విధంగా ముందు ఉంటామని ఆత్మకూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, పట్టణ అధ్యక్షులు ఎస్ఎస్ సయ్యద్‌మీర్, ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక కమిటీ అధ్యక్షులు 16వ వార్డు కౌన్సిలర్ కురుపాటి విజయ్‌చౌదరి, వైద్యశాల సూపరిడెంట్ డాక్టర్ రాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి నెల 30వ తేదీ పౌష్టిక ఆహారం అందించే విధంగా చొరవ తీసుకుం టున్న ఆర్‌డిటి స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ప్రభుత్వ వైద్యశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గర్భిణీ, చెంచు గిరిజన బాలింతలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు జహురుద్దీన్, వార్డు కౌన్సిలర్లు ప్రకాష్ రావు రహిమాన్, మిట్ట కందల మహబుతుల్లా, వైసిపి నాయకులు రఫిక్ కుదుష్, బెస్త శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎం ఏ రషీద్

స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు

ఇళ్ల స్థలాలను అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న వారిపై, అక్రమంగా ఎక్కించిన అధికారాలపై చర్యలు తీసుకోవాలని మిట్ట కందల గ్రామస్తులు కోరారు. మైనార్టీ మైనార్టీ కుటుంబాలు సుమారు 20 కుటుంబాలు సర్వేనెంబర్ 320లో 0.58 సెంట్ల విస్తీర్ణంలో గత 60 సంవత్సరాల నుండి ఇల్లు నిర్మించుకొని నివాసాలు కొనసాగిస్తున్నారు కానీ ఈ సర్వే నంబర్లు అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ స్థలాన్ని కబ్జా చేసి వారి పేర్లపై ఆన్లైన్లో ఎక్కించుకున్నారని, ఈ విషయంపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సోమవారం స్పందనలో సంబంధించిన మైనార్టీలు ఖాజామొహిద్దిన్, ఖాదర్ వలీ, మౌలాలి, కరీంసా, మున్న, ఫైల్ మాన్, మౌలాలిలు డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న మా ఇంటి స్థలాలను ఇతరులకు ఎలాగా ఆన్లైన్లో చేస్తారని వారు ప్రశ్నించారు. అన్ని కరెక్ట్‌గా ఉన్నా వారివే ఆన్లైన్లో చేయక కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఇలాంటివి ఎలా చేస్తున్నారని వారు ప్రశ్నించారు. మా ఇంటి నంబర్లపై ప్రభుత్వానికి ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నామని, ఈ విషయంపై గతంలో ఫిర్యాదు చేసిన ప్పటికీ వాటిపై ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికీ స్పందించకుంటే ధర్నా చేపడతామని వారు తెలిపారు. స్పందించిన డిప్యూటీ తాసిల్దార్ కలెక్టర్ దృష్టికి పంపామని పొరపాటున ఈ భూమి ఇతరులపై ఎక్కిందని దాన్ని సరిచేసి మీ పేర్లతో ఎక్కిస్తామన్నారు.


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సచివాలయాలను కౌన్సిలర్లు సందర్శన


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణములోని మారుతి నగర్–7, సాయిబాబ పేట–13, హాజీ నగర్–14 సచివాలయాలను వార్డు కౌన్సిలర్‌లు లాలు ప్రసాద్, సమీరా భాను, ఉస్మాన్ బేగ్, అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో సోమ వారం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు మన్సూర్ జె.సి.యస్ కన్వీనర్ అబుబక్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పథకాల ద్వారా లబ్ధి పొందిన మొత్తాన్ని పాంప్లేట్ రూపంలో వారి కుటుంబానికి అందించడం జరిగిందన్నారు. నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే మరో కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు వెళ్ళేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సిద్ధంగా ఉండాలని అన్నారు. పట్టణ అధ్యక్షులు మన్సూర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన ప్రస్తుత పాలనకు తేడా గమనించాలన్నారు. జె.సి.ఎస్ కన్వీనర్ అబూబక్కర్ మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం గురించి ప్రపంచ స్థాయికి చేరిందన్నారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్ మాట్లాడు తూ జగనన్నపై అభిమానంతో సచివాల య, కన్వీనర్లు గృహ సారథులు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు చింత విజ్జి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు అబ్దుల్ రహిమాన్, బాండ్స్ శ్రీను, సయ్యద్ రఫీ, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు : సిఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రవర్తనలో మార్పులు రాకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు సిఐ నాగ భూషణ్ హెచ్చరించారు. సోమవారం కొత్తపల్లి మండలంలో ఉన్న గువ్వలకుంట్లల గ్రామంలో ఎస్ఐ హుస్సేన్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు అనుమాని తుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, నంబర్ ప్లేట్ లేని, సరి అయిన రికార్డులు లేని 6- మోటారు సైకిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడు తూ ప్రశాంతతకు మారుపేరైన గ్రామాల్లో అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడుతూ ప్రవర్తనలో మార్పు రాకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామస్తులకు, యువతకు చెడు అలవాట్లు, ఇతర అసాంఘిక కార్యకలపాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పాలెంచెరువు గూడెం, నల్లమల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీపై సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పాములపాడు ఎస్ఐ అశోక్ సిబ్బంది ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

క్రీడల అభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

క్రీడల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు అన్నారు. సోమవారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో రాత్రి సమయాలలో క్రీడా శిక్షణ ఇచ్చేందుకు దాతలు ఎల్ఈడి బల్బులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసుకున్నందుకు తొమ్మిది ఎల్ఈడి బల్బులు విశ్రాంతి ఉపాధ్యాయులు రామలింగారెడ్డి, పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు రాగన్న ఎల్ఈడి బల్బులను విరాళం ఇచ్చారన్నారు. ఒక్కొక్కటి రూ. 2250 విలువ చేసే 9 ఎల్ఇడి బల్బులను పాఠశాలకు ఇవ్వడం జరిగిందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలా క్రీడాకారులను ప్రోత్సహిస్తే ప్రతిభగల క్రీడాకారులు ముందుకు వస్తారన్నారు. ఎల్ఈడి విద్యుత్తు దీపాల వల్ల రాత్రి సమయంలో కూడా కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను అలాగే క్రీడా సాధన చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎల్ఈడి విద్యుత్ దీపాలను విరాళంగా ఇచ్చిన వారిని పదనోపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఎల్ఈడి దీపాలను విరాళంగా ఇచ్చిన దాతలను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల రషీద్, ఎల్లనాయుడు, కృష్ణ, క్రీడా శ్రీ తోకల పితాంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడ మైదానంలో ఏర్పాటు చేసుకునేందుకు ఎల్ఈడి బలుపులో అందజేస్తున్న దాతలు

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల నగర పంచాయతీలోని అన్ని వార్డులలో తాగునీటి, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కారం చేయడానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అన్నారు. స్థానిక బేతంచెర్ల పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం నందు వార్డు కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం సోమవారం నాడు చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర నాయక్ నగర పంచాయతీ పరిధిలోని జరగబోతున్న సిసి రోడ్లు, తాగునీటి సమస్య, డ్రైనేజీ, తదితర సమస్యలను పరిష్కారం చేయడం కోసం నివేదికను ప్రవేశపెట్టారు. కౌన్సిల్ మెంబర్లు పలు వార్డులలో తాగునీటి సమస్యను చైర్మన్, కమిషనర్‌ల దృష్టికి తీసు కెళ్లగా స్పందించిన చైర్మన్ వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎన్జీవోస్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అల్లభ కాష్ దర్గా, శ్రీనగర్ కాలనీ, ఎండిఓ, ఎమ్మార్వో ఆఫీసు మధ్యలో గల వీధులలో గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందని అందుకు టెండర్లు నివేదికను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పర్వీన్, కౌన్సిలర్ జ్యోతి, ముబీనా, ఆ బీద, హుస్సేన్ బి, చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, ఇబ్రహీం కోఆప్షన్ ఎల్లయ్య రాంగోపాల్, ఆదిలక్ష్మి, ఆంజనేయులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలం రెడ్డి

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో గల బర్డ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన సంజనాశ్రీ, భార్గవిరెడ్డి, వైష్ణవిలు అంతర్జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సింధూర తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 17 వరకు తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సంజనాశ్రీ,భార్గవిరెడ్డిలు బంగారు పతకాలను,వైష్ణవి వెండి పతకాన్ని సాధించారని తెలియజేసారు. అద్భుత ప్రతిభ కనబరచిన వీరు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. త్వరలో థాయిలాండ్ దేశంలోని బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విద్యార్థులను, శిక్షకుడు రవిశంకర్‌ను బర్డ్స్ సంస్థల అధినేత పాల్‌జారావు, హెచ్ఎం సింధూర,ఇంచార్జ్ హెచ్ఎం బార్నబాస్,కో ఆర్డినేటర్ భాస్కర్,బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం సింధూర

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కోటయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ అండర్ -17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన సాయిచరణ్, కార్తిక్‌లు,బాలికల విభాగంలో నవ్యశ్రీ, హరితలు, అండర్ -14 బాలుర విభాగంలో మాబు షరీఫ్, బాలికల విభాగంలో లక్ష్మికళ్యాణి, మనీషాలు ఎంపిక య్యారన్నారు. ఈ నెల 11న కర్నూలులో జరిగిన ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 4న ఒంగోలు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ -17 క్రీడాకారులు ,గుంటూరులో జరిగే పోటీలలో అండర్ - 14 కు చెందిన క్రీడాకారులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కోటయ్యపిడి దాదాపీర్,పిఈటి భారతి, ఉపాధ్యా యులు తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం,ఉపాధ్యాయులు

ఆర్‌టిసి కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్



ఆర్‌టిసి కార్గో సేవలను సద్విని యోగం చేసుకోవాలని డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల భాగంగా ఈనెల 26 నుండి నవంబర్ 25 వరకు జరగబోయే కార్గో డోర్ డెలివరీ ఉంటుందన్నారు. అతి తక్కువ చార్జీలతో ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలలోకి తీసుకొని వెళ్లే సదుద్దేశ్యంతో ఈ మాసోత్సవాలు ఏర్పాటు చేయబడ్డా యన్నారు. డోర్ డెలివరీ ప్రచార కార్యక్ర మంలో యూనియన్ నాయకులు వారి బం ధువులకు పార్సెల్ పంపించి ఆర్టీసీ యాజ మాన్యం చేపట్టిన కార్యక్రమంలో భాగస్వా ములుగా కావాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి. సరోజమ్మ, సూపర్డెంట్ పీవీఎస్ భరణి కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎంఎం బాష, ఏడిసివైడి ఆర్ స్వామి పాల్గొన్నారు.

బోరింగ్‌కు మరమ్మతులు చేయించండి

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని దామ గట్ల గ్రామంలో బైరెడ్డి నగర్‌లోని ఎస్సీ కాలనీ వద్ద చెడిపోయిన బోరింగ్‌కు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. బోరింగ్ చెడిపోయి ఐదు నెలలు కావస్తుందని, సంబంధిత అధికారులకు, సర్పంచ్ సుశీలమ్మకు తెలిపినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోయారు. మంచినీళ్ల ట్యాంకు చీలికలు వచ్చి పనిచేయడం లేదని, దీంతో గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని వాపోయారు. అధికారులు బోరింగ్ రిపేర్ చేయించి నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మంచినీళ్ల ట్యాంకుకు వచ్చిన చీలికలు